సాక్షి
వికారాబాద్
సోమవారం, 2, జనవరి, 2023



జీవనోపాధే లక్ష్యంగా..
రైతులు, నిరుద్యోగులు, సహకార సంఘాలకు ఉపాధి, ఉత్పత్తే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఎల్ఎం పథకాన్ని ప్రవేశపెట్టింది. 8లో▸



శివుడి సేవలో..

బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని కలెక్టర్ నిఖిల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.
- అనంతగిరి

న్యూస్‌రీల్

నేడు వికారాబాద్‌కు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక

వికారాబాద్ అర్బన్: జిల్లా కోర్టుకు సోమవారం హైకోర్టు చీఫ్ జస్టిస్, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ ఉజ్జల్ భుయాన్ హాజరువుతున్నట్లు వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కోర్టు ఆవరణలో లీగల్ అవేర్నెస్ సర్వీసెస్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు హాజరు కావాలని ఆయన కోరారు.

మంత్రికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు



మంత్రి సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం మంత్రి సబితారెడ్డిని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవ చేయాలని తెలుపుతూ ఒకరికొకరు అభినందనలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయ సంఘం నాయకులు

వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయ ఆవరణలో పీఆర్‌టీయూ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ పోరాటం చేయడం అభినందనీయమన్నారు. జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, సీపీఎస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల పీఆర్‌టీయూ అధ్యక్షులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి మంత్రి తలసాని పూజలు

రాంగోపాల్‌పేట్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ ఏడాది కూడా మరింత అభివృద్ధి సాధించాలని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. నూతన సంత్సరం పురస్కరించుకుని ఆయన ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈఓ గుత్తా మనోహర్ రెడ్డి, చైర్మన్ సురిటి కామేష్, బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈవో అన్నపూర్ణ, మాజీ కార్పొరేటర్లు అరుణ గౌడ్, కిరణ్మయి, శేషుకుమారి నాయకులు పాల్గొన్నారు.

'కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాలి'

ఇబ్రహీంపట్నం రూరల్: నూతన సంవత్సరంలో కొత్త లక్ష్యాలతో ముందుకు వెళ్తే అనుకున్నవన్నీ సాధించవచ్చని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి హరికృష్ణ భూపతి అన్నారు. రంగారెడ్డి కోర్టులో ఆదివారం జ్యుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి తిరుపతితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయం కోసం వచ్చే వారికి తప్పకుండా సహాయం అందుతుందన్నారు. అనవసరమైన గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరగొద్దని సూచించారు. న్యాయ వ్యవస్థ అందరికీ సమానమేనన్నారు. చట్టాలపై అవగాహన అవసరమన్నారు.



అనంతగిరిలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలో పూలతో అలంకరించిన ఉత్తర ద్వారం

నేడు ఉత్తర ద్వార దర్శనం

ముస్తాబైన దేవాలయాలు

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం చేశారు. అన్నిదేవాలయాలను ముస్తాబు చేశారు. ఉత్తర ద్వారాలను అందంగా తీర్చిదిద్దారు. కొడంగల్ పట్టణంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, ధర్మకర్తలు తెలిపారు. ఉదయం 6గంటల నుంచే వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని వైష్ణవ దేవాలయాల్లో ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు చేశారు.
- అనంతగిరి/కొడంగల్ రూరల్



కొలువుదీరిన స్వామివారు

గిరి.. భక్త ఝరి

అనంతగిరి గుట్టకు భక్తులు పోటెత్తారు. ఆదివారం నూతన సంవత్సరం పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో, స్నేహితులు, బంధువులతో కలిసి వచ్చి అనంతుడిని దర్శించుకున్నారు. భక్తులు క్యూలైన్‌లో భారీగా బారులు తీరారు. అనంతరం ఆలయ పరిసరాల్లో సేదతీరారు. టీఎస్‌పీఎస్సీ మెంబర్ అరుణకుమారి కుటుంబసభ్యులతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.
- అనంతగిరి



అనంతగిరిలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

ఫుల్లు కిక్కు!



న్యూ ఇయర్ జోష్‌లో తెగతాగేసిన మద్యం ప్రియులు

- ఎక్సైజ్ శాఖకు రెట్టింపు ఆదాయం
- పోలీసుల నాకాబందీ, తనిఖీలు ముమ్మరం
- చిన్నచిన్న ఘటనలు మినహా అంతా ప్రశాంతం

వికారాబాద్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలో మద్యం ఏరులై పారింది. 2022కు వీడ్కోలు.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే వేళ మందుబాబులు ఫుల్లుగా మద్యం తాగేశారు. ఎక్సైజ్ శాఖకు న్యూ ఇయర్ కిక్కు ఇచ్చింది. చాలా మంది ముందు రోజు నుంచే మద్యం కొనుగోలు చేశారు. చివరి రెండు రోజుల్లో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగినట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.6కోట్ల మద్యం విక్రయాలు జరిగాయన్నారు.

రాత్రంతా పహారా..

మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ 20 ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు, నాకాబందీ నిర్వహించింది. రాత్రంతా పహారా కాశారు. ముమ్మర తనిఖీల ద్వారా 35 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 365 వాహన దారులకు చలానా విధించారు. వీటి ద్వారా ఒకేరోజు రూ.1.22 లక్షల జరిమానాలు వసూలు చేశారు. మరో 46 లేజర్ స్పీడ్‌గన్ కేసులు నమోదు చేసి రూ. 47,610 జరిమానా విధించారు. మోటార్ వెహికల్ చట్టానికి విరుద్ధంగా వ్యవహరించిన 62 వాహనాలను పోలీసులు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఐదు ఈ పిటీ కేసులు, 10 ఓపెన్ బూజింగ్ (మద్యం) కేసులు నమోదు చేశారు. జిల్లాలో చెదురు మదురు ఘటనలు మినహా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా ముగిశాయి. జిల్లాలో ఉన్న 59 మద్యం దుకాణాలు, 8 బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం అమ్మకాలు మిగతా రోజులతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. పట్టణాలు, గ్రామాలు అని తేడా లేకుండా మద్యం పారింది.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

జిల్లా అంతటా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ, గ్రామాలు, మండల కేంద్రాల్లో హడావుడి నెలకొంది. ఇప్పటి వరకు పట్టణాలకే పరిమితమైన న్యూ ఇయర్ వేడుకలు ఈ సారి గ్రామాల్లోనూ కనిపించాయి. శనివారం అర్ధరాత్రి వరకు డ్యాన్సులు, ఎంజాయ్ చేస్తూ గడిపిన యువత అర్ధరాత్రి 12 కాగానే కేకులు కట్‌చేసి కొత్త సంవత్సరానికి ఘనస్వాగతం పలికారు. పట్టణంలోని చర్చిలన్నింటిలో ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే అన్ని దేవాలయాలు కిటకిటలాడాయి. అనంతగిరి, దామగుండం, భూకైలాస్, పాంబండ, లొంక హనుమాన్ తదితర దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్త సంవత్సరం అంతా మంచే జరగాలని ప్రజలు దేవతా మూర్తులను కోరుకున్నారు.

బడులకు మహర్దశ



వికారాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

- పీఎం శ్రీ యోజనకు ఎంపికైతే నిధుల వరదే
- జిల్లాలో 198 పాఠశాలల దరఖాస్తు
- ఏడాదికి రూ.40లక్షల చొప్పున ఐదేళ్ల పాటు నిధులు
- ఈ నెలలో తనిఖీ చేయనున్న ప్రత్యేక బృందాలు

వికారాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ యోజన పథకానికి ప్రభుత్వ పాఠశాలలు ఎంపికైతే ఐదేళ్ల పాటు నిధుల వరద పారనుంది. ఈ పథకం కింద ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు ఏడాదికి రూ. 40లక్షల నిధులు ఇవ్వనుంది. సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ యోజన (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని తీసుకొచ్చింది. కేంద్రం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం పాఠశాలలు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గత నెల 20తో దరఖాస్తు గడువు కూడా ముగిసింది. జిల్లాలో 198 పాఠశాలలను గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాలల వివరాలను ఆయా హెడ్‌మాస్టర్ల లాగిన్ నుంచి ప్రభుత్వానికి పంపించారు.

మరింత బలోపేతం చేసేందుకే..

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దశంతో ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు పెద్ద ఎత్తున నిధులు ఇవ్వనుంది. ఏడాదికి రూ. 40లక్షల చొప్పున ఐదేళ్ల పాటు రూ. 2కోట్లను ఇవ్వనుంది. ఏడాదిలో ఒక మండలంలో 8 పాఠశాలలను ఎంపిక చేసే విధంగా మార్గదర్శకాలు రూపొందించారు. ఇందులో నాలుగు ప్రాథమిక పాఠశాలలను, నాలుగు హైస్కూల్‌ను ఎంపిక చేయనున్నారు. ఈ ఏడాదికి జిల్లాలోని 19 మండలాల నుంచి 198 పాఠశాలలను అర్హత కింద గుర్తించి ఆ పాఠశాలల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సహకారం ఇస్తామని..

పథకం కింద ఎంపిక కావాలంటే ముందుగా సర్పంచ్, స్కూల్ కమిటీ సభ్యులు అభివృద్ధి పనులకు పూర్తిగా సహకరిస్తామని తీర్మానం చేసి లిఖిత పూర్వకంగా ఇవ్వాలి. ఈ పథకం కింద ఎంపిక కావాలంటే పాఠశాలకు సొంత భవనం ఉండాలి. విద్యార్థుల సంఖ్యకు తగ్గ తరగతి గదులు సైతం ఉండాలి. విద్యార్థులకు కనీస అవసరాలైన మరుగుదొడ్లు, నీటి సరఫరా, రోడ్డు మార్గం ఉండటంతో పాటు, ఆటస్థలం ఉండాలి. అగ్నిప్రమాదాల నివారణకు అనువుగా ఉండాలి. పాఠశాలకు విద్యుత్ సరఫరా వంటి వసతులు ఉన్న పాఠశాలలను పథకం కింద ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

రెండు బృందాల తనిఖీలు..

పథకం కింద జిల్లా నుంచి 198 పాఠశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. మార్గదర్శకాల్లో పేర్కొన్న దానికి, దరఖాస్తులో తెలిపిన వివరాలు సరిగ్గా ఉన్నాయా లేవా అనే విషయాన్ని తెలుసుకునేందుకు జనవరి మొదటి వారంలో జిల్లా స్థాయిలో ఒక టీం ఆయా పాఠశాలలను సందర్శించనుంది. ఈ కమిటీ సభ్యులు పంపిన రిపోర్టు ఆధారంగా మార్చి నెలలో రాష్ట్ర స్థాయిలో మరోమారు పాఠశాలలను పరిశీలిస్తారు. ఆ తరువాతే పథకం కింద ఎంపికయ్యే అవకాశం ఉంది.

మౌలిక వసతుల కల్పన

ఈ పథకం కింద పాఠశాలలు ఎంపికైతే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. భవనాలకు మెరుగులు, సరిపడా మరుగుదొడ్లు, వినూత్న పద్ధతిలో బోధనకు సామగ్రి, సోలార్ విద్యుత్, ఎల్ఈడీ బల్బులు, ఫ్యాన్లు, ప్లాస్టిక్ రహిత వస్తువులు, స్వచ్ఛమైన తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ఐదు ఏళ్ల పాటు రూ. 2కోట్లు ఇవ్వనుండటంతో దశల వారీగా అదనపు తరగతి గదులు, మరుదొడ్లు, లైబ్రరీ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. పథకం పూర్తి స్థాయిలో అమలైతే పాఠశాలలు ఎంతో మెరుగుపడనున్నాయి.

ఎంపికైతే ఎంతో మేలు..



పీఎం శ్రీ యోజన పథకం కింద ఎంపికైన పాఠశాలలకు ఎంతో మేలు జరుగనుంది. జిల్లా నుంచి 198 పాఠశాలలు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం వచ్చింది. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వారి లాగిన్ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి బృందాలు తనిఖీ చేశాక వారి నివేదిక మేరకు తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన పాఠశాలలకు నిధులు విడుదల చేసే అవకాశం ఉంది.
- రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి

దూరవిద్య పూర్వ విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని ప్రొఫెసర్.జి రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఇతర కోర్సులు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే ఓయూ గ్లోబల్ అలుమ్ని మీట్-2023కు హాజరుకావచ్చని వెల్లడించారు.

స్పాట్ రిజిస్ట్రేషన్

గ్లోబల్ అలుమ్ని మీట్-2023కు హాజరు కావాలనుకునే పూర్వవిద్యార్థులు ఇంత వరకు రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే గ్లోబల్ అలుమ్ని మీట్ వద్ద పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

రేపు వీసీ రీసెర్చ్ అవార్డుల ప్రదానం

ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 3న వైస్ చాన్సలర్ రీసెర్చ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీల పర్మినెంట్, కాంట్రాక్టు అధ్యాపకులు రేపు ఉదయం 10.30 గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో హాజరుకావాలని పేర్కొన్నారు.



మార్కెట్‌లో కందులకు తూకం వేస్తున్న సిబ్బంది

కందులు @ రూ.7,557

- సీజన్ ఆరంభంలోనే రికార్డుస్థాయిలో ధరలు
- భౌగోళిక గుర్తింపుతో పెరిగిన డిమాండ్
- మార్కెట్ యార్డులో ఊపందుకున్న కొనుగోళ్లు

తాండూరు: సీజన్ ఆరంభంలోనే కందులకు రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. తాండూరు కంది పప్పునకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ప్రకటించింది. దీంతో కందులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. జిల్లాలో కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఇదిలా ఉంటే.. సీజన్ మొదట్లో కురిసిన భారీ వర్షాలకు పంట దిగుబడులపై ప్రభావం పడింది. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ కంది పంటను సాగు చేశారు. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో అధికంగా సాగు అయ్యింది. వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.95 లక్షల ఎకరాలలో కంది పంటను సాగు చేశారు. జూన్ నెలలో వేసిన పంట డిసెంబర్, జనవరి నెలలో దిగుబడులు వస్తాయి. వర్షాలు అధికంగా కురిసినందు వల్ల కంది పంటకు నష్టం వాటిల్లింది. అయితే దిగుబడులు మార్కెట్‌కు రావడం మొదలయ్యాయి.

భారీ డిమాండ్

రెండేళ్లుగా కందులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.6,600 ధర నిర్ణయించింది. ఈ సారి జాతీయ స్థాయిలో కందులకు భారీ డిమాండ్ పెరిగింది. తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు కందులకు గరిష్ఠ ధర రూ. రూ.7,547, కనిష్ఠ ధర రూ.5,211, సగటు ధర రూ.7,537 ధర నిర్ణయించారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.1,000 వరకు అధికంగా ధర పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో కందులకు డిమాండ్ ఉండటంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.

ఇప్పటికే రూ.5.25కోట్ల వ్యాపారం..

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కంది పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో రూ.5.25కోట్ల వ్యాపారం జరిగింది. మార్కెట్ కమిటీ పరిధిలో దాదాపు 79 కమీషన్ ఏజెంట్‌ల ద్వారా ఇప్పటి వరకు 7,100 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేశారు. జనవరి నెలలో సీజన్ మరింత ఊపందుకొనుంది. మూడు నెలల పాటు కందుల వ్యాపారం కొనసాగుతోంది. ఈ సారి మార్కెట్‌కు 1.50 లక్షల క్వింటాళ్ల కందులు మార్కెట్‌కు రావచ్చని మార్కెటింగ్ శాఖ అంచనా వేస్తోంది.

జీఐ ట్యాగ్‌తో..

తాండూరు కందిపప్పునకు కేంద్ర ప్రభుత్వం తాండూరు దాల్‌గా జీఐ ట్యాగ్(భౌగోళిక గుర్తింపు)నిచ్చింది. తాండూరు దాల్‌మిల్లుల్లో క్వింటాలు కందిపప్పునకు రూ.11,300 ధర పలుకుతోంది. ప్రస్తుతం వస్తున్న కంది ఉత్పత్తులు మిల్లుల్లోకి చేరితే ధర 12,000 పైగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

ప్రయాణికుల సంక్షేమానికి పెద్దపీట



ప్రయాణికులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి టీఎస్ ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రయాణికులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ప్రయాణికులతో ముచ్చటించి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో పని చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందని, గత సంవత్సరం ప్రయాణికులు బాగా ఆదరించారని చెప్పారు. ఒక్క రాఖీ పౌర్ణమి నాడే దాదాపు 40 లక్షల మంది ప్రయాణించారని, ఆ ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ. 20 కోట్ల రాబడి వచ్చిందని గుర్తు చేశారు. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రయాణికుల ఆదరాభిమానాలు ఉంటాయని ఆశా భావం వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది ఆర్టీసీకి రెండు కళ్లలాంటివారన్నారు. ప్రయాణికుల సంక్షేమానికి ఈ ఏడాది పెద్దపీట వేస్తామని తెలిపారు. అందుకు ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. లేఖలు, ట్విట్టర్ ద్వారా తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రజారథాన్ని సజ్జనార్ ప్రారంభించారు.

ప్రయాణికులకు సన్మానం

ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఎండీ సజ్జనార్ సన్మానించారు. సంగీత, కిష్టయ్య, బి.జయలక్ష్మి, జయ ప్రకాష్, సుధారాణి, స్వప్న, లక్ష్మణ్, అశోక్, నర్సింహులు, నరసింహా రెడ్డి, సుధాకర్, సిద్ధా రెడ్డి, ప్రమీల, జి.రమాదేవి, సుధామని, కంభం రాములు, జె. శ్రీనివాస్, సుహాసిని, ఉమాపతి, సునీత, సీహెచ్ విజయ్, ఎస్.ఎం.హుస్సేన్, ఎండీ జియాస్, దనలక్ష్మి, సరితను శాలువాలతో సత్కరించారు.

క్లుప్తంగా

నేడు ఉత్తర ద్వార దర్శనం

పరిగి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని ఆలయ కమిటీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి భక్తులకు స్వామి దర్శనం ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

వైభవంగా కృష్ణగిరి జాతర



జాతరలో వెలసిన దుకాణాలు

బొంరాస్‌పేట: మండల కేంద్రమైన దుద్యాల శివారులో వెలసిన కృష్ణగిరి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. వేడుకల చివరి రోజు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు లంకాదహనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త సంవత్సరం కావడంతో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు భారీగా తరలివచ్చారు.

పాతకక్షలతో పరస్పర దాడులు

దోమ: మూడేళ్ల క్రితం యువతి అదృశ్యం కేసుకు సంబంధించి ఇద్దరు మహిళలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శనివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఐనాపూర్‌కు చెందిన రాములమ్మ, భీమమ్మ పరస్పరం దాడి చేసుకున్నారు. రాములమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విశ్వజన్ తెలిపారు. అయితే మూడేళ్ల క్రితం భీమమ్మ కూతుర్ని రాములమ్మ కుమారుడు తీసుకెళ్లాడు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలిసింది.

గేదెలు కడుగుతుండగా నీట మునిగి వ్యక్తి మృతి

మొయినాబాద్: గేదెలు కడుగుతూ ప్రమాదవశాత్తు కుంటలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమంగళారం గ్రామానికి చెందిన వడ్డె మల్లేష్(40) వ్యవసాయం తోపాటు పశుపోషణ చేస్తున్నాడు. శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని కుంటలో గేదెలు కడుగుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఎంతకీ తేలకపోవడంతో స్థానికులు అతని కోసం గాలించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి అతని శవాన్ని వెలికి తీశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనుమతి లేకుండా వేడుకలు

కేసు నమోదు చేసిన పోలీసులు

పహాడీషరీఫ్: అనుమతులు లేకుండా ఓ ఫాంహౌస్‌లో మద్యం పార్టీ చేసుకున్న ఇద్దరిపై పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. జల్‌పల్లిలోని లలిత్ ఫాం హౌజ్‌లో నితిన్, సిద్ధార్థ్ అనే యువకులు అనుమతులు లేకుండా డిసెంబర్ 31న మద్యం తాగుతూ.. హుక్కాను పీల్చుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి 11.30గంటలకు దాడి చేసి మద్యం, హుక్కా ఫ్లేవర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవనోపాధే లక్ష్యంగా..

ఎన్‌ఎల్‌ఎం పథకం అమలు

- గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి ప్రభుత్వాల సహకారం
- 50శాతం సబ్సిడీతో పథకం అమలు
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పశుసంవర్ధకశాఖ

దౌల్తాబాద్: రైతులు, నిరుద్యోగులు, సహకార సంఘాలకు ఉపాధి, ఉత్పత్తే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా కోళ్లు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు దాణా, పశుగ్రాసాన్ని 50శాతం రాయితీపై అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అర్హులైన రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశం మాంసం ఉత్పత్తి, గుడ్ల ఉత్పత్తిలో ఆత్మ నిర్భర్‌గా మన దేశాన్ని తీర్చిదిద్దడంతోపాటు విదేశాలకు మాంసం, గుడ్లు ఎగుమతి చేయడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వివిధ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ పట్టణ, గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ పథకం కింద గరిష్ఠంగా కోటి రూపాయల యూనిట్ విలువతో 50శాతం సబ్సిడీపై కోళ్లు, గొర్రెలు, మేకలు పందుల పెంపకం చేపట్టవచ్చు. ఇందుకు పశుసంవర్ధకశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

సబ్సిడీ ఇలా...

కోళ్ల పెంపకం యూనిట్ విలువ రూ. 25లక్షలు కాగా ప్రభుత్వం సబ్సిడీగా రూ. 12.5లక్షలు అందిస్తుంది. మిగిలిన 50శాతం నిధులు బ్యాంకు రుణం గానీ, స్వయంగా గానీ సమకూర్చుకోవాలి. ఇందులో భాగంగా 1000 వనరాజ, గ్రామీణ కోళ్లు అందిస్తారు. గొర్రెలు, మేకలు పెంపకం కోసం దరఖాస్తు చేసుకుంటే 500 గొర్రెలు, మేకలతో పాటు 25 పొట్టేళ్లను, 25 మేకపోతులను అందిస్తారు. యూనిట్ విలువ కోటి వరకు ఉండగా 50శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. పందుల పెంపకం యూనిట్ విలువ రూ. 35 లక్షలు కాగా 50శాతం సబ్సిడీ కింద రూ. 17.5లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. రాష్ట్ర స్థాయిలో అర్హులను ఎంపిక చేసి లబ్ధిదారులకు మొదట సబ్సిడీలో 50శాతం నిధులు అందజేస్తారు. యూనిట్ ప్రారంభించిన రెండేళ్ల తర్వాత మిగిలిన సగం సబ్సిడీని బ్యాంకులో జమ చేస్తారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం షెడ్ నిర్మాణం, నీటి వసతి ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకానికి రైతులు, స్వయం సహకార సంఘాలు, పరిపతి సంఘాలు, నిరుద్యోగ యువత, సొంత భూమి గానీ, లీజుపై భూమి తీసుకున్న వారు గాని అర్హులు. గొర్రెలు, మేకలు పందులు, కోళ్ల పెంపకంలో తగిన అనుభవం కలిగి ఉండాలి.



దరఖాస్తులు..

ఆసక్తి కలిగిన వ్యక్తులు, స్వయం సహాయక సంఘాలు, ఇతర గ్రూపుల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు బ్యాంకు కాన్సెంట్, ఇతర ధ్రువీకరణ పత్రాలు జతచేసి జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే మండల కేంద్రంలోని పశువైద్యశాలల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఈ పథకం ప్రారంభించారు. గొర్రెలు, మేకలు, పందులు కోళ్ల పెంపకం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చు. వివరాలకు మండల పశువైద్యశాల అధికారులను సంప్రదించాలి.

– అనిల్‌కుమార్, జిల్లా పశువైద్యాధికారి

'నూతన' వేడుకలు ప్రశాంతం

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లాలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని వివరించారు. బందోబస్తు, మొబైల్, బ్లూ కాప్స్, పెట్రోలింగ్, డ్రంక్‌అండ్ డ్రైవ్, ఎంవీయాక్టు, ఈపిట్టి కేసులు స్పీడ్ గన్‌లు మొదలగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో నాకాబందీ చేపట్టి 62 వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. 365 ఎంవీయాక్టు కేసులు, 46 స్పీడ్ గన్ కేసులు, 35 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈపిట్టి కేసులు, 10 ఓపెన్ బుజింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ప్రశాంతంగా నూతన సంవత్సరం వేడుకలు ముగియడంతో ఎస్పీ సిబ్బందిని అభినందించారు.



వికారాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న సిబ్బంది

దళితులను హిందుత్వం నుంచి వేరుచేసే కుట్ర

అంబేడ్కర్ వాదులమంటూ అనుచిత వ్యాఖ్యలు

- బైరి నరేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- ఎస్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న ఎస్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు

తాండూరు టౌన్: దళితులను హిందుత్వం నుంచి వేరు చేసే కుట్ర జరుగుతోందని పలువురు ఎస్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. ఆదివారం పాత తాండూరులోని అంబేడ్కర్ పార్కులో పార్టీలకతీతంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ వాదులమని చెప్పుకుంటూ కొందరు హిందుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇటీవల రావులపల్లిలో అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వాడు కాదని, కానీ అంబేడ్కర్ వాది నంటూ హిందూ దేవుళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడి, అంబేడ్కర్ భావజాలాన్ని అనుసరించే ఎస్సీలను నిందలకు గురిచేస్తున్నారన్నారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్, కదిరి కృష్ణ, రెంజర్ల రాజేష్‌ల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హిందూ దేవుళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడాలనేది అంబేడ్కర్ వాదంలో ఎక్కడా లేదన్నారు. ఇది కేవలం దళితులను హిందుత్వం నుంచి పక్కకు తప్పించేలా ఇతరులు చేస్తున్న కుట్రయేనని ఆరోపించారు. అలాగే తాండూరు నియోజకవర్గంలో కొందరు పెత్తందారులు, అగ్రవర్ణాల వారు ఎస్సీలను మభ్య పెట్టి, భయపెట్టి ఇతరులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఇలాంటి తప్పుడు కేసులను ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ యూత్ అసోసియేషన్ సభ్యులు నవీన్, ఉదయ్‌భాస్కర్, విజయ్, సురేష్, శ్రీకాంత్, శ్రావణ్, జుంటుపల్లి వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ప్రకృతి వనం

- జీపీ కార్యదర్శుల పర్యవేక్షణలో వనాలు
- అదనపు బాధ్యతలు వద్దంటున్న కార్యదర్శులు

ధారూరు: మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటిలో పండ్లు, పూల మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంచడానికి, గ్రామస్థులు సేద తీరడానికి వీటిని ఏర్పాటు చేశారు. ఇంత వరకు ఉపాధిహామీ పథకం సిబ్బంది పర్యవేక్షణలో కొనసాగిన వీటిని ఇటీవల ప్రభుత్వం జీపీల కార్యదర్శులకు అప్పగించింది. సర్పంచ్, కార్యదర్శి కలిసి ఈ బాధ్యతను నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో వెనుక నుయ్యి, ముందు గొయ్యి అన్న చందంగా మారింది గ్రామ కార్యదర్శుల పరిస్థితి. ఉపాధిహామీ సిబ్బంది పర్యవేక్షణలో ఉంటేనే బాగుంటుందని వారు అంటున్నారు. జీపీల్లోని వివిధ పనుల వత్తిడి వల్ల వీటిని పర్యవేక్షించలేమని, ప్రతి మొక్కకూ తామే బాధ్యులం కావాల్సి ఉంటుందని వారి భయం. గ్రామ సర్పంచులు సరిగ్గా పట్టించుకోకపోవడం, మొక్క పాడైతే ముందుగా తమపైనే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తారని వారి భయం.



కేరెళ్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం

అందుబాటులో యాప్

రాష్ట్రంలో ఎక్కడ నుంచైన పల్లె ప్రకృతి వనాల వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టి అనుసంధానం చేసింది. జీపీల కార్యదర్శులు పల్లె ప్రకృతి వనాల్లో ఐదు రకాల ఫొటోలను తీసి ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. పల్లె ప్రకృతి వనాల వివరాలను నమోదు చేస్తూ రావాలి. లేని పక్షంలో జీపీ కార్యదర్శిపై చర్యలుంటాయని అధికారులు స్పష్టం చేశారు. దీంతో తమ విధులు కత్తిమీద సాము వంటిదని వారు భీతిల్లుతున్నారు.

రోడ్డుపైనే లారీలు.. ప్రమాదాలకు నిలయాలు

పట్టించుకోని పోలీసులు



అంతారం రోడ్డు పక్కనే నిలిపిన లారీలు

తాండూరు రూరల్: రోడ్డుపైనే లారీలను నిలుపుతున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాండూరు మండలం గౌతపూర్ నుంచి స్థానిక చెక్‌పోస్ట్ వరకు లారీలను నిలుపుతున్నారు. అదేవిధంగా తాండూరు నుంచి అంతారం వెళ్లే మార్గంలో విలియంమూన్ చౌరస్తా వద్ద రోడ్డుకు ఇరువైపులా లారీలు ఉంటున్నాయి. ఇటుక, ఇసుక, బండరాళ్లు రవాణా చేసే లారీలు రోడ్డు పక్కనే ఆపి ట్రాక్టర్లకు లోడ్ చేస్తారు. లారీలు ఇరువైపులా నిలపడంతో జామ్ అవుతోంది. దీంతో వివిధ గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ పోలీసులు పట్టించుకోవడంలేదు. లారీ పార్కింగ్‌కు ప్రభుత్వం స్థలం కేటాయించినా అది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీంతో లారీలన్నీ పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పార్కింగ్ స్థలాన్ని చదును చేసి వెంటనే పనులు పూర్తి చేస్తే లారీల పార్కింగ్‌కు సమస్య ఉండదు.

వాటర్ ట్యాంకులో పడి పంచాయతీ కార్మికుడి మృతి



రాంజీ మృతదేహం

కొత్తూరు: ఓవర్ హెడ్ ట్యాంకు మరమ్మతుల కోసం పైకి ఎక్కిన పంచాయతీ కార్మికుడు ట్యాంకులోనే పడి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కొడిచర్లతండా పంచాయతీ ఖాజీగూడతండాలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఖాజీగూడతండాకు చెందిన రాంజీ(38) పంచాయతీలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఉదయం ట్యాంకు నుంచి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తండా సమీపంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు పైకి ఎక్కి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కింద నున్న మిగిలిన సిబ్బంది గుర్తించి స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునేలోపే నీటిలోపడి ఊపిరాడక చనిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ట్యాంకులోని నీటిని తొలగించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు సంతానం. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సయీద్ తెలిపారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రేవంత్‌రెడ్డి, నాయకులు

షాబాద్: అట్టడుగు వర్గాల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింపుల సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, వసంతం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహులు, జంగయ్య, గౌరీశ్వర్, చంద్రారెడ్డి, శ్రీరాములు,కుమార్, శ్రీకాంత్, కొండల్‌యాదవ్, రా జుగౌడ్, ఆంజనేయులు,సత్యం,శ్రీనివాస్‌రెడ్డి,మహేశ్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

మొయినాబాద్‌రూరల్: నిరుద్యోగ యువతి, యువకులు సన్మార్గంలో నడుచుకున్నప్పుడే కుటుంబ పోషణతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్ పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలో హాజీపాషా స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న వేబ్రిడ్జ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రవియాదవ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉద్యోగాలు లేవని నిరాశ చెందకుండా సన్మార్గంలో నడిచేందుకు స్వయం ఉపాధి వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత క్రమశిక్షణతో మంచి మార్గంలో నడిచినప్పుడే తమ కుటుంబాలకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా తోడ్పడతారని తెలిపారు. మారుతున్న కాలానికి, పెరుగుతున్న జనాభాతో అందరికి ఉద్యోగాలు లభించవని, ఉద్యోగాలు లేవని నిరాశ చెందవద్దన్నారు. కార్యక్రమంలో పర్వేజ్, ఎండీ ఇబ్రహీం, నర్సింహ్మ పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి



ఎస్పీతో మాట్లాడుతున్న ఐక్యవేదిక ప్రతినిధులు

అనంతగిరి: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర అయ్యప్ప ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్‌లో ఎస్పీ కోటిరెడ్డికి కలిసి వినతిపత్రం అందజేశారు. బైరి నరేష్‌కు సహకరించిన రేంజర్ల రాజేష్, ఇతరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బైరి నరేష్‌తో పాటు ఆ వేదికపై కూర్చొని హిందూ దేవుళ్లను అవమానించిన, సమర్థించిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ గురుస్వామి, బిచ్చిరెడ్డి, రాధాకృష్ణ, ప్రేమ్‌సింగ్, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

చెక్కలోని గూడ, ఇబ్రహీంపట్నంలో ఘటనలు

కొందుర్గు: ఎదురెదురుగా వస్తున్న కారు, మోటర్ సైకిల్ ఢీ కొనడంతో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన కొందుర్గు మండలం చెక్కలోనిగూడ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం సాయంత్రం తంగెళ్లపల్లి వైపు నుంచి కొందుర్గు వైపు వస్తున్న కారు, కొందుర్గు వైపు నుంచి తంగెళ్లపల్లి వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు పల్టీకొట్టింది. కారు నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడగా, మోటర్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తుల్లో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఒకరి కాలు విరిగింది. వీరిని స్థానికులు చికిత్స కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కొందుర్గు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో..

ఇబ్రహీంపట్నం: కారు, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. మంచాల మండల కేంద్రానికి చెందిన గణేశ్(35) బైక్‌పై వెళ్తుండగా ఓ కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో గణేశ్‌కు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్టర్‌లో సంతకాల మాయ!

విధులకు రాకున్నా మరుసటి రోజు వచ్చి సంతకాలు

- కేశంపేట ఎంపీహెచ్‌ఈఓ నిర్వాహకం

కేశంపేట: విధులకు హాజరవ్వనని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడు.. ఆసుపత్రికి రాలేనని హాజరు పట్టికలో సీఎల్ పెడతాడు.. ఆసుపత్రికి వచ్చిన రోజు సీఎల్ ఉన్న చోట సంతకం చేసి మాయ చేస్తాడు... ఇది కేశంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఇటీవల బదిలీ పై వచ్చిన ఓ అధికారి నిర్వాకం. గతేడాది నవంబర్ 14న సిద్దిపేట జిల్లా నుంచి ఉపేందర్‌రెడ్డి కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంపీహెచ్‌ఈఓగా బదిలీపై వచ్చాడు. ఆరోగ్య కేంద్రంలో అధికారులు విధులకు హాజరైతే విధిగా రిజిస్టర్‌లో సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఉపేందర్‌రెడ్డి మాత్రం తనకు తాను వెసులుబాటు కల్పించుకున్నాడు. విధులకు హాజరుకాకుండా ఉంటే ముందు రోజు సీఎల్ అని రాస్తున్నాడు. సీఎల్ రాసే చోట తన సంతకంతో మ్యాచ్ అయ్యేలా ముందే జాగ్రత్త పడతాడు. మరుసటి రోజు ఆస్పత్రికి వచ్చాక సంతకం చేస్తున్నాడు. ఈ విషయమై యూడీసీ నూరుల్లా హసన్‌ను సంప్రదించగా ఉపేందర్‌రెడ్డి హాజరు మారుస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇన్‌చార్జి యూడీసీగా విధులు నిర్వహిస్తున్నందున పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదన్నారు. ఇదే విషయమై ఉపేందర్‌రెడ్డిని వివరణ కోరగా నేను డిప్యూటేషన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నానని, అందుకే విధులకు సరిగా హాజరు కావడం లేదని, సెలవులో ఉన్నానని పొంతనలేని సమాధానం చెబుతున్నాడు.. మండలంలోని ఓ శాఖకు చెందిన అధికారి తనకు బంధువని చెబుతుండడం గమనార్హం.

రైతుల ఇళ్లల్లోనే తెల్ల బంగారం

- భారీగా తగ్గిన ధరలు
- కొనుగోలుకు ముందుకురాని వ్యాపారులు
- వడ్డీలు పెరుగుతున్నాయని రైతుల ఆవేదన



ఎన్కేపల్లిలోని ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి దిగుబడి

మోమిన్‌పేట: ధరల్లో హెచ్చు తగ్గుల వల్ల పత్తి కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. పత్తి తీత పూర్తి కావచ్చినా ఇంకా ఇళ్లలోనే నిల్వ ఉందని వారు తెలిపారు. ప్రతి సంవత్సరం నవంబర్ చివరి వారంలోనే తెల్ల బంగారం అమ్మకాలు, కొనుగోలు జోరందుకునేవని రైతులు తెలిపారు. పెట్టుబడులకు తెచ్చిన అప్పులపై వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ కంటే ముందుగా మార్కెట్ ధరలు ఎగువన ఉండగా సీజన్ వచ్చి ఇంటికి పత్తి రాగానే ధరలు తగ్గడంతో ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. మార్కెట్‌లో స్థిరీకరణ లేకపోవడం వలన వ్యాపారులు సిండికేటుతో ధరలు తగ్గించారని రైతులు ఆరోపించారు. నెల రోజుల క్రితం క్వింటాలు పత్తి రూ. 9,600లు ధర పలికింది. ప్రస్తుతం రూ.7000లకు పడిపోయింది. రూ. 10వేలకు పైగా విక్రయించవచ్చని భావించిన రైతన్నలకు నిరాశే మిగులుతోంది. క్వింటాలు పత్తికి మార్కెటులో ఒక్కసారి రూ. 2000 తగ్గడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వికారాబాద్ జిల్లాలో పత్తిని విక్రయించడానికి మార్కెట్ లేకపోవడం దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. దళారులు చెప్పిన ధరలకు తెల్ల బంగారాన్ని విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తీసిన కూలీలకు డబ్బుఇవ్వాల్సి ఉందని, దిగుబడిని విక్రయిస్తే తప్ప వారికి డబ్బు ఇవ్వలేమని తెలిపారు.

అధిక విస్తీర్ణంలో పత్తి సాగు

గత సంవత్సరం పత్తికి ప్రభుత్వ మద్దతు ధర కంటే రెట్టింపు పలికింది. జనవరి తర్వాత అమ్ముకొన్న రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అడవి పందుల బెడద కారణంగా ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న పంట స్థానంలో పత్తి సాగు చేశారు. దీంతో మండలంలో 80శాతం పత్తి సాగు చేశారు. అతివృష్టి వల్ల సగం దిగుబడి కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు తగ్గడం సీజన్ కంటే ముందు క్వింటాలుకు రూ.9600వరకు ధర పలకడం రైతులు ముమ్ముందు ఇంకా పెరుగుతుందనే ఆశలో ఉన్నారు. కానీ ఇందుకు భిన్నంగా ధరలు తగ్గడంతో రైతులకు మింగుడు పడడం లేదు. ఇంకో 15రోజుల వరకు వెచి చూసి తప్పని పరిస్థితిలో ధర తక్కువకైన అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

ఐదు ఎకరాల్లో..



సొంత భూమి ఎకరాతోపాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. మొత్తం పత్తి పంట సాగు చేశా. ఇప్పటి వరకు రూ. 1.20లక్షలు పెట్టుబడి పెట్టా. అతివృష్టి వల్ల దిగుబడులు అమాంతం పడిపోయింది. 25క్వింటాళ్లు వచ్చింది. విక్రయిద్దామంటే వ్యాపారులు రావడం లేదు. వారు వచ్చే వరకు ఆగాల్సిందే.

– ఆనందం, రైతు, ఎన్కేపల్లి

కొంత మేర పెరిగిన ధర

పెద్దేముల్: పత్తి పంట ధర పెరగడంతో రైతులు దిగుబడిని మార్కెట్‌కు తరలిస్తున్నారు. నాలుగు రోజు క్రితం వరకు క్వింటాలు పత్తి రూ. 7,200 నుంచి రూ.7,300 వరకు ఉండగా శనివారం రూ. 8,200కు చేరుకుంది. ప్రభుత్వ సీసీఐ కొనుగోలు కంటే ధర ఎక్కువ ఉందని కాటన్ మిల్లుల యజమానులు అంటున్నారు. కాగా రైతులు మాత్రం క్వింటాలుకు రూ.10వేలు చెల్లించాలని కోరుతున్నారు. కొంత మంది రైతులు కూలీల డబ్బుల కోసం రెండు, మూడు క్వింటాళ్లు విక్రయించినట్లు తెలిసింది. చాలా మంది రైతులు ధర మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. మండలంలోని నాగులపల్లి, మారేపల్లి, పెద్దేముల్, జనగాం, రుద్రారం, గోపాల్‌పూర్, ఇందూరు, మంబాపూర్, కందనెల్లితో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు గత ఏడాది కంటే ఈ ఏడాది పత్తి పంటను అధికంగా సాగు చేశారు.